సంపుటి: 4 | సంచిక: 5

జూలై - ఆగష్టు, 2016

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



Happy
INDEPENDENCE
Day



# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

ఈ పత్రికను చదువుతున్న మీరు ఎలా ఉన్నారు? పత్రిక ద్వారా పొందుతున్న ఆత్మీయ మేలులను బట్టి దేవదేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. మీలో కొందరు ఆ మేలులను ఉత్తరము మరియు ఫోన్ ద్వారా తెలియపరచుట వలన ప్రోత్సాహకరంగా ఉన్నందుకు ప్రత్యేకమైన వందనములు.

నేడు మనుష్యులలో ఎక్కువగా కనిపిస్తున్న ప్రధానమైన సమస్య ఎదుటి వారు చెప్పేదానిని ఏ మాత్రం శ్రద్ధగా వినకుండా సమాధానములు చెప్పడం. ఇది అజ్ఞానానికి నిదర్శనం. విజ్ఞులైన వారు ఎదుటివారు చెప్పేదానిని శ్రద్ధగా వింటారు. స్పర్శ పత్రికను చదువుతున్న ప్రతి ఒక్కరూ విజ్ఞులై యుండవలెనని నేనెంతగానో కోరుచున్నాను. జీవితములో అనేక విషయముల మీద ఇది ప్రభావం చూపిస్తుంది. బైబిలు గ్రంథములో కూడా వినుటకు వేగిరపడు, మాట్లాడుటకు నిదానించువారిగా ఉండాలని యాకోబు ద్వారా దేవుడు మనకి సెలవిచ్చాడు.

ఈ పత్రికను చదువుతున్న ప్రతి ఒక్కరు వినకుండా మాట్లాడే స్వభావమును విడిచిపెట్టడం ద్వారా ఎన్నో మార్పులను జీవితములో చూడగలరు.

అట్టి ధన్యత దేవుడు మనకు దయ చేయును గాక!

మీ సహోదరుడు.....



సంపుటి: 4 | సంచిక: 5 జూలై - ఆగష్టు, 2016

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- సత్య మార్గము ............ 2
- ఓ క్షణం గురించి ఆలోచించు ............ 5
- సోమరియైన స్త్రీ (స్త్రీల ప్రత్యేకం) ............ 6
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 47వ భాగము ............ 9
- ట్రిక్ (బాలల శీర్షిక) ............ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ............ 13
- గొప్ప ప్రణాళిక ............ 15
- ప్రార్థనా శక్తి ............ 18
- మూర్ఖు(రా)లు ............ 20
- బైబిల్ క్విజ్-47 ............ 22
- జన్మదిన శుభాకాంక్షలు ............ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# సత్య మార్గము -బ్రదర్. ఎపఫ్రా

**యెన్నాళ్ళ మట్టుకు మీరు రెండు తలంపుల మధ్య తడబడుచుందురు? 1 రాజులు 18:21**

ఏది సత్యము? దేనిని అనుసరించాలో మనం నిర్ణయించుకోవాలి. జీవితం గురించి అన్ని రకాల దృక్పధములను, అభిప్రాయములను అంగీకరించడం అనేది విశాల హృదయముగాను, సహనముగాను కొందరు ఎంచుతుంటారు. కానీ ఏ మనుష్యుడు రెండు భిన్నమైన అభిప్రాయములను సమానముగా గౌరవించలేడు. అతని హృదయం రెండు తలంపులతో ఎప్పుడూ నెమ్మదిగా ఉండలేదు. ఈ నవ నాగరిక సమాజములో మనుష్యులు పూర్తిగా వ్యాపార దృక్పధంతో జీవించుట వలన మంచిని మంచి అని, చెడుని చెడు అని చెప్పలేని నిస్సహాయమైన స్థితిలో కొట్టుమిట్టాడుతూ బ్రతుకుతున్నారు.

ఒకానొక రోజున దైవభక్తుడైన ఏలియా రెండు ఆలోచనలతో ప్రజలు ఉండడం గమనించాడు. ఒక ఆలోచన భూమ్యాకాశములను సృజించిన యెహోవా దేవుడు అని, మరియొక ఆలోచన మనుష్యులు ఏర్పరచిన బయలు అనే దేవత దేవుడు అనే తడబాటు ఎరిగి వారిని ఆ ఇబ్బందికరమైన స్థితి నుండి విడిపించాలని కోరుకోవడం జరిగింది. ఈ దినములలో ఇలాంటి బాధ్యత కలిగిన భక్తులైన వారు కనిపించడం అరుదు. కేవలం మనుష్యులను సంతోషపరచడానికి ఉన్న శ్రద్ధ వారిలోని పొరపాటు లేక తడబాటుని హెచ్చరించడంలో కనబడదు. ఎవరు ఎలాంటి ఆలోచనలతో ఉన్నా వారిని సమర్ధించడమే ధ్యేయంగా పెట్టుకున్న ఎంతో మంది పెద్దలను, బోధకులను చూస్తున్నాము. దీనివలన ప్రజలకు స్పష్టమైన ఆలోచనా విధానం లేకుండా పోతుంది. ఆనాటి ఏలియా ప్రజలందరి దగ్గరకు వచ్చి యెహోవా దేవుడైతే ఆయనను సేవించుడి, బయలు దేవుడైతే వాని ననుసరించుడి అని సూటిగా ఒక మాట చెప్పాడు. వారిలో ఒక్కరు కూడా సమాధానం చెప్పలేదు ఎందుకంటే రెండు తలంపుల మధ్య వారు ఎటూ తేల్చుకోలేకపోవడం. ఏలియా అక్కడున్న జనులందరితో మాకు రెండు ఎడ్లను ఇవ్వండి, బయలుదేవతను ఆరాధించే 400 మంది ప్రవక్తలు ఉన్నారు. వారు ఒక ఎద్దును తునకలుగా చేసి కట్టెల మీద పెట్టవలెను. ఆలాగు చేసి వారి దేవుడికి ప్రార్థన చేయగా అగ్ని వచ్చి దానిని దహించాలి. నేనును మరియొక ఎద్దును ఆలాగున సిద్ధపరచి యెహోవాకు ప్రార్థన చేస్తాను. ఏ దేవుడు అగ్నిని పంపించి, వీటిని దహింపచేస్తాడో ఆయనే నిజమైన దేవుడని నమ్మండి, మీ రెండు తలంపుల ధోరణిని విడవండి. దానికి ప్రజలందరూ సరే అని ఒప్పుకున్నారు. అప్పుడు బయలు ప్రవక్తలు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎంత కేకలు వేసినా, వారి శరీరములు కోసుకున్నప్పటికి అగ్ని దిగి రాలేదు. ఆ తరువాత ఏలియా ప్రార్థన చేయగా ఆకాశం నుండి

అగ్ని దిగి వచ్చి వాటిని దహించి వేసింది. అక్కడ ఉన్న జనులందరూ యెహోవానే దేవుడు అని బిగ్గరగా కేకలు వేయటం జరిగింది.



రెండు తలంపులు మనకి ఏ మాత్రము క్షేమమును ఇవ్వలేవు. రెండు లేక అనేక తలంపుల స్వభావం నుండి మనం ఖచ్చితంగా బయటపడాలి. రెండు తలంపులు మనలను నటన, వేషధారణ కలిగిన వారిగా కూడా మార్చివేయవచ్చు. ఇవి ఎంతో ప్రమాదకరమైనవి.

ఇంచుమించుగా 2000 సం॥లకు పూర్వము నూతనముగా ఏర్పరచబడిన ఆది సంఘములో ఏకమనస్సుతో, ఏకాత్మతో దేవునిని సేవిస్తూ సంతోషంగా ఉండేవారు. ఒకరోజు వారందరూ కలసి ఒక నిర్ణయం తీసుకున్నారు. ఆయన ప్రేమ సందేశం అనగా నిత్య జీవపు మార్గం ప్రపంచమంతా ప్రకటించాలి గనుక మనకి కలిగిన స్థిర చరాస్థులన్నీ అమ్మివేసి ఒక చోట ఉంచుకొని ఎవరి అక్కర కొలది వారు ఉపయోగించుకుందాం. అందరూ దానికి సమ్మతించారు, వారందరూ ఒకే ఆలోచనతో ఈ పని జరిగించారు.

అయితే వారిలో అననీయ, సప్పీరా అనే భార్యా భర్తలు రెండు తలంపులతో అనగా 1. అమ్మి ఇవ్వాలని 2. భవిష్యత్ గురించి దాచు కోవాలని. ఈ రెండింటి మధ్య తడబడుచూ కొంత దాచుకొని, మిగిలినది సంఘనాయకుడైన పేతురు వద్దకు తెచ్చినట్లుగా బైబిల్ గ్రంథంలో వ్రాయబడి ఉంది. అప్పుడు పేతురు అననీయ అనే వ్యక్తితో పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను నీ హృదయమును ఎందుకు ప్రేరేపించాడు? నీ దగ్గర ఉన్నప్పుడు అది నీదే గదా అని అనడం జరిగింది. నీవు దేవునితోనే అబద్ధమాడితివి అనగా ఈ మాటలు వింటూ అననీయ ప్రాణం విడిచాడు. ఈ సంఘటన జరిగిన 3 గంటల తరువాత అతని



భార్య రాగా, పేతురు ఇంతకే అమ్మితిరా అని అడుగగా ఆమె కూడా ఇంతకే అని చెప్పింది. అప్పుడు పేతురు ప్రభువు ఆత్మను శోధించు టకు ఎందుకు ఏకీభవించి తిరి? అనగా ఆమె కూడా పేతురు పాదముల దగ్గర పడి చనిపోయింది. రెండు నిండు ప్రాణములు బలి కావడానికి కారణము రెండు తలంపులు. మనుష్యుడు దేవునికి, సిరికి దాసుడిగా ఉండలేడు. లేక రెండింటిని ప్రేమించలేడు (మత్తయి 6:24) అని బైబిల్ గ్రంథములో వ్రాయబడి ఉన్నది.

ప్రియ చదువరీ! నీవెవరివైనా సరే దేవునిని ఆరాధించుటలో కానీ, ఆయన వాక్యమును అనుసరించుటలో కానీ రెండు తలంపులతో జీవించడం ఏ మాత్రం మంచిది కాదు. ఈ దినములలో మనుష్యులు మానవ జ్ఞానంతో దైవజ్ఞానమును అడ్డగిస్తూ మనుష్యులను సంతోషపరుచుట కొరకు రెండు లేక అంతకంటే ఎక్కువ తలంపులతో బ్రతకడం శోచనీయం. **యేసుక్రీస్తు నిజదేవుడు ఆయన తప్ప వేరే మార్గము లేదు** అనేది బైబిల్ గ్రంథ సారాంశము. వేరొక తలంపుకు అవకాశమే లేదు. కనుక రెండు తలంపుల మధ్య ఊగిసలాడే ధోరణికి స్వస్తి చెప్పి, ఆయన మార్గములో సాగిపోదాం.

అట్టి కృపను దేవుడు మనకి అనుగ్రహించును గాక !

# ఓ క్షణం గురించి ఆలోచించు



నీవు టెన్షన్‌గా ఉన్న ఓ క్షణం
అటెన్షన్‌ని కోల్పోతావు
మొత్తానికి కన్ఫ్యూజన్‌లోకి పోతావు
అప్పుడు ఇరిటేషన్ ఫీల్ అవుతావు



తద్వారా వ్యక్తిగత సంబంధములను నాశనం చేసుకుంటావు
తరువాత సహకారం లభించకుండా పోతుంది
పరిస్థితులన్నీ క్లిష్టతరంగా మారతాయి
నీ బి.పి. ప్రమాదస్థాయికి చేరవచ్చు



అప్పుడు మెడిసిన్ తీసుకొనవలసి రావచ్చు
వెంటనే పరిస్థితిని అర్థం చేసుకుంటే
పరిష్కారం కొరకు ఆలోచించవచ్చు
అనేక సమస్యలు చర్చించుకోవడం ద్వారా పరిష్కారమవుతాయి
అది నీకు సాధ్యమవుతుంది

**ఇది నా ఉచిత సలహాగా భావించవద్దు**

**కేవలం ముందు జాగ్రత్త మాత్రమే**

**నీకు నా ఉద్దేశ్యం అర్థమైతే ఎప్పటికీ నీవు టెన్షన్ పడవు**

**ఒక్క క్షణం కోపం జీవితమునే నష్టపరచవచ్చు**

**జీవితకాలము శోకాన్ని మిగల్చవచ్చు**

# సోమరియైన స్త్రీ

సిస్టర్ వి.విజయ

అబ్బా! అప్పుడే తెల్లవారిందా? నిద్ర లేవాల్సిందేనా? పనులు చేయాలా? తప్పదు, లేవాలి అన్నట్లుగా ప్రతి ఉదయం బద్ధకంగానూ, సణుగుతూ లేచేవారు ఎందరో. ఈ విధంగా ప్రతిదినమును ప్రారంభిస్తే సంతోషంగా ఎలా ఉండగలము? సోమరితనము గాఢనిద్రలో పడవేస్తుంది. ఇక కొంచెము నిద్రించెదనని కొంచెము కునికెదనని కొంచెము సేపు చేతులు ముడుచుకొని పరుండెదనని నీవనుచుందువు అని సామెతలు 6:10లో వ్రాయబడి యున్నది.

మనుష్యులతో పోలిస్తే ఎలాంటి ప్రాధాన్యత లేని చీమకు కూడా సోమరి కంటే ఎక్కువ బుద్ధి ఉన్నది అని మహాజ్ఞాని సామెతల గ్రంథములో చెప్పుచున్నాడు. **"సోమరీ, చీమల యొద్దకు వెళ్ళుము వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము వాటికి న్యాయాధిపతి లేకున్నను పై విచారణకర్త లేకున్నను అధిపతి లేకున్నను అవి వేసవి కాలమందు ఆహారము సిద్ధపరచుకొనును కోత కాలమందు ధాన్యము కూర్చుకొనును - సామె 6:6,8"**

చీమలు ఎంతో జ్ఞానముతో వాటి నడవడిక విషయమై చాలా జాగ్రత్తగా ఉంటున్నాయి అని మనకు అర్థమగుచున్నది. వాటికి పైన అధికారి లేదు, విచారణ చేయడానికి విచారణకర్త లేదు, ప్రశ్నించడానికి న్యాయాధిపతి లేదు - అయిననూ వాటి బాధ్యతల విషయమై, ఆహారమును సమకూర్చుకొనే విషయములో ఎంతో జ్ఞానముతో ప్రవర్తిస్తున్నాయి. మనకి పైన దేవుడు ఉన్నాడు. ప్రశ్నించే కుటుంబస్తులు ఉన్నారు అయినా కొందరు బాధ్యత లేని వారిగా ఉంటున్నారు. బాధ్యతగా ఉండుట మనుష్యుల యొక్క కనీసధర్మం.

గుణవతియైన భార్య "చీకటితోనే లేచి తన ఇంటి వారి కొరకు భోజనమును సిద్ధపరచును" అని లేఖనములలో చెప్పబడింది. నేటి దినములలో ఉదయమునే లేచి భర్తకి, పిల్లలకి భోజనము సిద్ధపరిచే విషయము ఎంతో కష్టంగా భావిస్తున్నారు. నాకు ఉదయమే లేవడం అలవాటు లేదు, లేవలేను అని చెప్పే స్త్రీలు చాలా మంది ఉన్నారు.

కొంతమంది తల్లులు యౌవ్వనులైన పిల్లలను, మా అమ్మాయికి ప్రొద్దున్నే లేవడం అలవాటు లేదు, పనులు చేయడం అస్సలు రాదు అని సమర్థిస్తూ ఉంటారు. ఈ దినములలో ఇలా చెప్పడం కూడా ఫ్యాషన్‌గా మారింది. తల్లులు ఆలాగున సమర్థించక, చెడ్డ అలవాట్లను ఖండించి, బాధ్యతలను నేర్పించి, తోటివారితో స్నేహభావంతో మెలగడాన్ని ప్రోత్సహించాలి. అప్పుడు వారు ఎక్కడికి వెళ్ళినా, ఎవరి మధ్య ఉన్నా, అనేకులకు ఆశీర్వాదకరంగా ఉంటూ, మంచి పేరును తెచ్చిపెడతారు.

సోమరితనము సమయము యొక్క విలువను గ్రహించకుండా చేస్తుంది. చేయవలసిన పనులు సమయమునకు చేయకుండా వాయిదా వేయడం సోమరితనమునకు చాలా ఇష్టం. కుటుంబములలోని స్త్రీలు ఇంటిలో చేసుకోవలసిన పనులు చాలా ఉంటాయి. ఇల్లు శుభ్రంగా ఉంచుకోవడం, భర్తకి, పిల్లలకి కావలసినవి అమర్చి, అన్నీ సిద్ధంగా ఉంచడం, బట్టలు శుభ్రంగా పెట్టడం, ఇవి చేయకుండా సోమరితనముతో ఎప్పుడూ నిద్రపోతూ మాకు సమయం ఉండట్లేదు అని అనుకునే స్త్రీలు కొందరు! ఇంకా వ్యర్థమైన సంభాషణలతో ముసలమ్మ ముచ్చట్లతో సమయమును వ్యర్థము చేస్తూ ఆర్థికంగా, ఆత్మీయంగా నష్ట పోతున్నవారు ఎందరో! ఆదాము, హవ్వలను దేవుడు ఏదేను తోటలో ఉంచి, ఒక్క వృక్ష ఫలములను తినవద్దు అని చెబితే, ఆ మాటని సాతాను అవకాశంగా తీసుకొని, హవ్వతో మాట్లాడుతూ ఉంటే హవ్వ ఆ మాటలలో మునిగిపోయి దేవుని ఆజ్ఞను అతిక్రమించింది. సోమరితనం వలన వ్యర్థమైన మాటలకు అవకాశం ఉంటుంది. అనవసరమైన ఆలోచనలకు కేంద్రబిందువుగా మన హృదయం ఉంటుంది.



సోమరితనము హృదయములోని మంచి ఆలోచనలు అనే పూతని పాడు చేయు గుంట నక్క వంటిది. క్రొత్త నిబంధనా గ్రంథములో ఒక యజమానుడు దేశాంతరము పోవుచూ తన దాసులైన వారిలో ఒకొక్కరిని పిలిచి ఒకనికి ఐదు, రెండు, ఇంకొకనికి ఒక్క తలాంతును ఇచ్చెను. యజమానుడు తిరిగి వచ్చే సమయమునకు ఐదు తలాంతులు తీసుకున్న వ్యక్తి మరి ఐదు తలాంతులు, రెండు ఉన్న వ్యక్తి మరి రెండు సంపాదించి అప్పగించారు. ఒక్క తలాంతు తీసుకున్న వ్యక్తి మాత్రం ఏమీ సంపాదించలేదు. కారణం అతను కష్టపడి పని చేయడానికి ఇష్టపడక సోమరితనముతో యజమాని ఇచ్చిన దానిని భూమిలో దాచి, తిరిగి ఒక్క తలాంతును యజమానికి అప్పగించాడు. అందువలన యజమాని చేత "సోమరివైన చెడ్డదాసుడా" అని పిలిపించుకున్నాడు.

**"చురుకుగా ఉండుట గొప్ప భాగ్యము" - సామె 12:27**

బైబిల్ గ్రంథములో నాబాలు భార్యయైన అబీగయీలు అనే స్త్రీ ఎంత చురుకుదనము కలిగినదో 1 సమూయేలు గ్రంథములో వ్రాయబడియున్నది. దావీదు, అతని సేవకుల కొరకు త్వరపడి, సిద్ధపరిచిన ఆహారము తీసుకొని వెళ్ళి, తనని తాను తగ్గించుకొని, ఆమె కనపరచిన సుబుద్ధి వలన ఆశీర్వదించబడిన స్త్రీగా చరిత్రలో నిలిచియున్నది

క్రొత్త నిబంధనా గ్రంథములో కొందరు స్త్రీలు ఆదివారము తెల్లవారుచుండగా యేసుప్రభువు దేహమునకు సుగంధద్రవ్యములు పూయవలెనని సిద్ధపరచుకొని, వెళ్ళిరి. వారు ఎంత వేకువనే లేచి, ఇళ్ళలో పనులు చేసుకొని, వాటిని సిద్ధపరచుకొని వెళ్ళారో మనం అర్థం చేసుకుంటే వారిలో ఉన్న తపనని గ్రహించగలం.

ఒక స్త్రీ వేకువనే లేచి దేవుని సన్నిధిలో ఆ దినమును దేవునికి అప్పగించి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి తన పనులను లేక బాధ్యతలను మొదలుపెడితే ప్రతి దినమూ ఆనందమే. సోమరిగా ఉంటే ప్రతి క్షణమూ ఆశాంతియే. కనుక ప్రియసహోదరీ! కుటుంబములో స్త్రీలుగా ఉన్న మనకు దేవుడు కొన్ని బాధ్యతలను, తలాంతులను అప్పగించాడు. సోమరితనముతో బాధ్యతలను చేయని వారిగా కాక, బాధ్యతలను నమ్మకంగా నెరవేర్చి భళా! నమ్మకమైన మంచి దాసురాలా! అని దేవుని చేత పిలిపించుకుందామా?

దేవుడు చురుకైన వారిగా మనలను చేయును గాక !


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**2016 ఆగష్టు 15వ తేది ఉపవాస ప్రార్థన**

దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,
కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవునిని వేడుకుందాం.

**సమయం:** ఉదయం గం. 9.00 లకు
వివరములకు: **9666666249**


 **అబద్ధం చెప్పటం శాపం లాంటిది, ఎందుకంటే అది మనలో తప్పించుకునే ధోరణి పెంచుతుంది.**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 47వ భాగము**

త్రివేంద్రం సభలలో ఎంతో మంది ప్రజలు క్రైస్తవులమని చెప్పుకుంటూ ఈ విధంగా సమకూడడం ఒక రకంగా చూస్తే సుందర్‌కి ఎంతో సంతోషమును కలిగించింది. అయితే ఆ సంతోషం ఎంతో కాలం నిలువలేదు. ఉత్తర భారతదేశంలోను, మధ్య భారతదేశంలోను తాను వెళ్ళిన లెక్కలేనన్ని గ్రామములలో యేసుప్రభువు సువార్త ఎన్నడూ వినబడలేదన్న విషయం గుర్తుకు రావడంతో ఆయన సంతోషం నిలువలేదు. బిషప్‌గారు ప్రార్థనాంశములను ఒకొక్కక్కటిగా చెప్తుంటే భక్తిగల వారు నెమ్మదిగా భయభక్తులతో ప్రార్థించనారంభించారు. అయితే "మీరు వెళ్ళి సర్వలోకంలోని సర్వసృష్టికి సువార్తనందించండి" అని 2000 సంవత్సరముల క్రితం యేసుక్రీస్తు అప్పగించిన పని చేయాలని ముందుకు వచ్చే యౌవనులు ఎక్కువమంది లేకుండడం సుందర్‌ని కృంగజేసింది. ఎప్పటిలానే సుందర్ వెళ్ళకముందే ఆయనను గూర్చి ప్రజలకు తెలిసిపోయింది. తాను ప్రసంగించాల్సిన సమయం రాగానే నిలబడి ఆ పెద్ద జనసమూహమును తేరి చూచాడు సుందర్. ప్రజలందరూ మౌనముద్రులై ఆయనను చూస్తూ ఉండినారు. అంతేకాక సుందర్ అక్కడ ఉండడం మాత్రం చేతనే ప్రజలలో దైవభయము వచ్చినది. వారికి ప్రసంగించ నారంభించినప్పుడు శతాబ్దముల క్రితమే దేవుడు తన వాక్యమును, తన కుమారుని సువార్తను మీకు అప్పగించాడని గుర్తు చేస్తూ ఈ సువార్తను తోటి దేశస్తులకు కూడా మీరు అందించలేక పోయారని ఎత్తి చూపాడు. దీని ఫలితంగా మీరు చేయవలసిన సేవను చేయడానికి దూరదేశములైన ఇంగ్లండ్, అమెరికాల నుండి దేవుడు ఇతరులను పంపించాల్సి వచ్చినది. ఆ దేశాల కంటే ఎన్నో వందలాది సంవత్సరములకు ముందే భారత దేశమునకు సువార్త అందినది. "ఓ యౌవనుడా, నిద్రలే, నీ చుట్టూ ఎంతమంది నశించి పోవుచున్నారో చూడు, వారిని రక్షించడం నీ పూచీ కాదా రక్షణ పొందడానికి ఇతరులను రక్షణలోనికి నడిపించడానికి అమూల్యమైన అవకాశమును దేవుడు మీకు ఇచ్చారు. దేవునికి స్తోత్రము. క్రీస్తుయేసుని కొరకై మంచి సైనికుల్లాగ ఉండండి. సర్వాంగ కవచమును ధరించి ముందుకి సాగండి. సాతాను కార్యములను అణచివేయండి. విజయం మీదే. ఇంతేగాక భయభక్తులతో కూడిన ఓ హెచ్చరికను కూడా

అందించాడు సుందర్. "మీరిప్పుడు నిర్లక్ష్యంగా ఉంటే మరో అవకాశం మీకు ఎన్నడూ రాదు. ఏమి చేయాలనుకున్నా ఇప్పుడే చేయాలి. ఈ యుద్ధభూమిలో మరల మీరు అడుగు పెట్టరు గనుక ఇప్పుడే చేయండి. క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించాలన్న ధ్యేయంతో తమ ఆరోగ్యమును, ఐశ్వర్యమును చివరకు తమ ప్రాణములను కూడా త్యాగం చేసిన హతసాక్షులు పరలోక మహిమను అనుభవించుటను చూచే ఆ దినం తరుముకొస్తున్నది. వారెంతో చేశారు. మరి నీవేం చేశావు ? ఆ దినాన్న మనం సిగ్గుతో తల వంచుకునే స్థితి రాకుండును గాక ! "

సువార్త వ్యాపకములో అప్పటికే తమ లోటును గ్రహించిన సిరియన్ సంఘం వారికి సుందర్ హెచ్చరికలు టానిక్ లాగా పని చేశాయి. భారతదేశములోని ఇతర ప్రాంతాలకు నెమ్మదిగా మిషనెరీలను పంపనారంభించారు. అయినప్పటికి దక్షిణ భారతదేశపు క్రైస్తవ్యంలోని బలహీనపరిచే ఘోరమైన ఓ గుణాన్ని ఎత్తి చూపకుండా ఉండలేకపోయాడు సుందర్. భారతదేశమును ఒక మనుష్యునికి పోల్చవచ్చు. హిమాలయాలను తలగాను, దక్షిణ ఇండియాను పాదములుగాను, పంజాబ్‌ను కుడిచేయిగాను, బెంగాల్‌ను ఎడమచేయిగాను పోల్చవచ్చు. ఈ మనిషి గట్టిగా నిలబడాలంటే పాదముల మీద (దక్షిణ ఇండియా) నిలబడాలి. దక్షిణ భారతదేశం దీనికి తగినదిగా ఉన్నది. ఇచ్చటి క్రైస్తవులు సంఖ్యాపరంగాను, విద్యా విషయంలోను ముందున్నారు. ఇచ్చటనున్న చాలా సంఘాలు స్వయం పోషకములైనప్పటికిని, అంటే ఈ మనుష్యుడు తన పాదములపై నిలబడగలుగుచున్నప్పటికిని నడవడం చేత కావడం లేదు. దీనికి కారణమేమి ? కొచ్చిన్‌లో ఓ యూదుడిని చూచాను. అతడు నిలబడినాడు కాని నడవలేకపోయాడు. ఎందుకని అతనికి బోదకాలు రావడంతో ఆ కాళ్ళు బాగా లావైపోయి చాల బరువుగా నుండడంతో అతడు నడవలేక పోయాడు. దక్షిణ భారతదేశంలోని క్రైస్తవ సంఘానికి ఈ బోదకాలు అనే జబ్బురావడం వలన భారత క్రైస్తవ సంఘము ఈ దేశమంతటికిని సువార్తని అందించలేక పోవుచున్నది. కులతత్వం ఓ బోదకాలు వలె ఉన్నది. వర్గభేధం అన్నింటి కంటె మరీ గొప్ప బలహీనత. దీనివలననూ, ఇంకా వివిధ కారణముల వలననూ ప్రేమ తగ్గిపోయి ఇతరులు రక్షణ పొందాలనే ఆతృత సన్నగిల్లినది. ఈ రోగం కుదిరితే దక్షిణ భారతదేశములో క్రైస్తవ సంఘం చక్కని సాధనంగా మారగలదు. తాను గమనించిన బలహీనతలను లోపములను సుందర్ గట్టిగానే ఖండించాడు.

సేకరించబడింది

(ఇంకా ఉంది)



# "ట్రిక్"

Hai Children! How are you? చాలా బిజీగా కనబడుతున్నారు? స్కూల్స్ స్టార్ట్ అయ్యాయి కదా! సమ్మర్ హాలీడేస్ తర్వాత .... మళ్లీ స్కూల్‌కి వెళ్లటం కష్టంగా ఉందా? క్రొత్త స్కూల్ జాయిన్ అయితే కష్టంగా ఉంటుంది కానీ పాత స్కూల్ అయితే ఇష్టంగానే ఉంటుంది, ఎందుకంటే పాత స్నేహితులే కాబట్టి. క్రొత్త స్కూల్‌లో ఫ్రెండ్స్ ని సెలెక్ట్ చేసుకోవడం కష్టం కదా! మీకు ఒక ట్రిక్ చెబుతానర్రా ఫ్రెండ్స్ ని చేసుకోవడం చాలా ఈజీ...

ఊహూ!!! ముందు మీకు ఒక మంచి స్టోరీ చెబుతా, ఆ స్టోరీలోనే ట్రిక్ ఏంటో మీకు అర్థమౌతుంది. సరేనా!! అనగనగా ఒక అడవిలో ఒక కుందేలు ఉండేది. అది ఎంతో మంచిది. జాలిగుండె గలది. చేతనైనంత వరకూ ఇతరులకు సహాయం చేస్తూండేది. ఒకసారి ఒక మేక అనారోగ్యంతో తిండిలేక పడివుంటే కుందేలు దాని దగ్గరకి వెళ్ళి "నేను నీకు మేత తెచ్చిస్తాను" అని చెప్పి, తన చిన్నారి నోటితో గడ్డిని ఈడ్చుకుని వచ్చి, మేకకు దండిగా మేత పెట్టింది. మరోసారి ఒక గుర్రం కాల్లో పలుకురాయి గుచ్చుకుని అది నడవలేకపోతుంటే కుందేలు వెళ్ళి తన పదునైన దంతాలతో ఆ రాయిని పెకిలించి వేసింది.

మరొకసారి ఒక డేగ రెక్కలకు దెబ్బతగిలి నేల మీద పడిపోగా కుందేలు వెళ్ళి చికిత్సకు పనికివచ్చే ఆకులు తెచ్చి పసరు పిండి ఆ పసరు గాయానికి రాసి, దాని గాయాలు మాన్పింది. ఆ తర్వాత ఒకరోజు కుందేలును ఒక వేట కుక్క తరుముతోంది. కుందేలు భయంతో పరిగెడుతూ మేకను చూసి "నన్ను రక్షించు" అని అడిగింది. అందుకు మేక "ఇప్పుడు కుదరదు, నాకు పని ఉంది" అంటూ వెళ్లిపోయింది. ప్రాణభయంతో పరిగెడుతూ గుర్రం దగ్గరకి వెళ్ళి "నన్ను రక్షించు" అని అడిగింది కుందేలు. "నా యజమాని నా కోసం ఎదురు చూస్తుంటాడు" అంటూ గుర్రం కూడా వెళ్ళిపోయింది. అప్పుడు ఆకాశంలో గ్రద్ద ఎగురుతూ వచ్చి "మిత్రమా! నన్ను గట్టిగా పట్టుకో" అని కుందేలుని వేట కుక్క బారినుండి రక్షించి దూరంగా తీసుకెళ్ళి దిగబెట్టింది.

కుందేలు అప్పటి నుండి గ్రద్దను బెస్ట్ ఫ్రెండ్ గా చేసుకుంది. ఎవరు ఆపదలో ఉన్నా సహాయపడుతూ ఉండేది. తనకు మేక, గుర్రం సహాయం చేయలేదని ఏ మాత్రం వాటిని వదిలి వేయలేదు. వాటితో కూడా స్నేహంగా మెలిగేది. అప్పుడు కుందేలును చూసి మేక,

గుర్రం కూడా సహాయం చేయటం నేర్చుకున్నాయి.

"మేలు చేయుట యందు విసుకక యుందము" అని బైబిల్ చెబుతుంది. ఇదే పిల్లలు నేను మీకు చెప్పాలనుకున్న "ట్రిక్". మీ స్కూల్‌లో మీరు కూడా మీకు తోచిన సహాయం చేస్తూ ఉంటే అందరూ మంచి స్నేహితులు అవుతారు. అంతే కాదు మీకు ఆపద కలిగినప్పుడు మిమ్మల్ని ఆదుకునే వారు కూడా ఉంటారు. మీ అవసరతను తీర్చని వారిని కూడా ప్రేమతో క్షమించి, వారి అవసరతలో సహాయం చేసి చూడండి మీరు పెద్ద హీరోలు అయిపోతారు.

ఇలా అవకాశం వచ్చినప్పుడల్లా మేలు చేస్తూ ఉంటే మనకి చాలా మంది స్నేహితులు ఉంటారు. మిమ్మల్ని అందరు మంచి పిల్లలు అంటారు. టీచర్స్ లెసన్స్ చెప్పేటప్పుడు శ్రద్ధగా వినండి. అర్థం కాకపోతే మరల అడిగి తెలుసుకోండి. ఏ రోజు వర్క్ ఆ రోజు కంప్లీట్ చేసుకోండి.

తల్లిదండ్రులు చెప్పినట్లు వినండి, తల్లిదండ్రుల మాట వినుట అనేది మీరు వారికి చేస్తున్న మేలు. మీ అవసరతలో దేవుని ప్రార్థించండి. బుక్స్ కొనుక్కోవడానికి, యూనిఫామ్స్, ఫీజులు ఇంకా ఇలా చాలా అవసరాలు ఈ టైంలో ఉంటాయి. తల్లిదండ్రులను విసికించవద్దు. వారు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారు. వారు చేస్తున్న మేలును మర్చిపోవద్దు. వారి యెడల కృతజ్ఞత కలిగి బాగా చదువుకుని మంచిపేరు తెచ్చుకుంటారని ఆశిస్తూ ....

– మీ అక్కయ్య


**ఎపఫ్రా మినిస్ట్రీస్ – వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

అందరూ ఆహ్వానితులే....!

**వివరములకు:**
9666666249 | 040-24202227


 అసహనం అనునది గర్వఫలం. గర్వం గల వ్యక్తి దేనికొరకు సరియైన ఉద్దేశ్యముతో వేచియుండలేడు

# "నా జీవితములో దేవుని మేలులు"

## జాన్సన్ బాబు, గుంటూరు

దేవుని నామమునకు స్తోత్రములు, అందరికి నా వందనములు. నా పేరు జాన్సన్‌బాబు, గుంటూరు జిల్లా చందోలు గ్రామము. నా చిన్నతనములోనే 5వ తరగతి చదువుతున్నప్పుడు మా నాన్నగారి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వచ్చాము. మాది మొదటి నుండి క్రైస్తవ కుటుంబమే అయిననూ నామకార్థముగా జీవించేవారము, అంతగా విశ్వాసము ఉండేది కాదు. హైదరాబాద్‌కు వచ్చిన తరువాత మా ప్రక్కింటి వారి ద్వారా చర్చి గురించి తెలుసుకొని, ఆ చర్చికి అందరమూ వెళ్ళేవారము. నేను ఆరాధనలో ఉన్నప్పటికి, ఆలోచనలు అన్నీ లోకం వైపు పరిగెడుతూ ఉండేవి. ఏ మార్పు లేకుండా నామకార్థంగానే జీవించేవాడిని. నా స్నేహితుల సహవాసము, వారి సాంగత్యము నన్ను చెడ్డ మాటలు పలుకుట యందు, ఎక్కువగా వాటిని ఉచ్చరించుటయందు బాగా పురికొల్పేవి. నేను ఆత్మసంబంధమైన విషయముల కంటే, లోకసంబంధమైన విషయములలో బాగా మునిగి తేలియాడేవాడిని.

నేను డిగ్రీ చేస్తున్నప్పుడు స్నేహితులతో కలిసి సిగరెట్ త్రాగుటకు సిద్ధపడ్డాను. ఒక సిగరెట్ సగం కాల్చిన తరువాత నా మనస్సులో దీని వలన ఏమి ప్రయోజనము లేదు గనుక దీనిని వదిలిపెట్టాలి అనే ఆలోచన కలిగినది. ఇది నా ఆత్మీయ తండ్రియైన యేసయ్య వలన కలిగినది అని రూఢిగా నమ్ముచున్నాను. అంతేకాక, అనేక సమయములలో తండ్రియైన దేవుడు నన్ను పాపములో పడనీయక కాపాడెను. అప్పుడు మారుమనస్సు పొంది, బాప్తిస్మము తీసుకోవాలని అనుకున్నాను కానీ కొన్ని పరిస్థితుల వలన తీసుకోలేకపోయాను. ఈ విధంగా నా ఎమ్.ఎస్.సి పూర్తి అయ్యింది. ఆ తరువాత 2005 వ సం॥లో బాప్తిస్మం తీసుకున్నాను. వివాహము కూడా జరిగింది. నా భార్య పేరు ప్రతిభ. ఆమె చిన్నప్పటి నుండి తన తల్లితండ్రులు ఆర్.సి.ఎమ్ చర్చ్ సభ్యులు కనుక ఆ సంఘమునకు వెళ్ళేవారు. వివాహమైన తరువాత నాతో పాటు మా చర్చ్‌కి వచ్చేది. కానీ ఆ రెండు స్థలములలో తనకి ఏమీ తేడా అనిపించేది కాదు. అలాగే వెళ్ళి వస్తూ ఉంటూ ఉండగా కొన్ని సంఘటనలు మా కుటుంబమును ఆ సంఘమునకు దూరం చేశాయి. తరువాత నామకార్థ క్రైస్తవుల వలెనే అనేక సంఘములకు మేము వెళ్ళాము కాని ఏదో తెలియని లోటు, నిరాశ, ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సమయములో మా ఇంటి దగ్గర ఉన్న ఒక సహోదరుని ద్వారా ఎపఫ్రా మినిస్ట్రీస్ గురించి తెలుసుకొని, 2010 డిసెంబర్ 25 క్రిస్టమస్ ఆరాధనకు మొదటి సారిగా వచ్చాము. దేవుని వాక్కు వలన మాకు ఎన్నో విషయములలో ధైర్యం, ఓదార్పు కలిగాయి. మన పరిచర్యకి వచ్చిన తరువాత ఇంతకుముందు మేము వెళ్ళే చర్చికి, ఇక్కడికి, క్రమములో

చాలా తేడా కనిపించేది. మాకు ఈ పరిచర్య పద్ధతిగాను, క్రమముగాను దేవుని వాక్య ప్రకారము జరుగుతుందని అనిపించింది. (ఆరాధన అంతా క్రమపద్ధతిలో ఎలా ఉండాలో నేర్చుకున్నాము) నా భార్య అయితే తను చిన్నప్పుడే ఆర్.సి.ఎమ్ సంఘ ప్రకారం చిలకరింపు బాప్తిస్మం తీసుకొని, అక్కడ ప్రభురాత్రి భోజనములో పాలు పంచుకునేది. ఎపఫ్రా మినిస్ట్రీస్ కి వచ్చిన తరువాత కూడా కొన్ని నెలలు అలవాటుగా ప్రభురాత్రి భోజనములో పాలు పంచుకునేది, కాని తన మనసులో ఏదో తప్పు చేస్తున్నానని అనిపించేదని చెప్పేది. దైవసేవకులు చెప్పిన వాక్యం, ఇతర పరిచర్యలలోలాగా నామకార్థంగా కాక, మనస్సులోని ఆలోచనలను గ్రహించి, తన గురించే చెబుతున్నట్లుగా అనిపిస్తుందని చెప్పేది. జనవరి 26న జరిగిన ఉపవాస ప్రార్థనలో బాప్తిస్మం అంటే చిలకరింపు బాప్తిస్మం కాదు, బైబిల్ ప్రకారం తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామములో బాప్తిస్మము తీసుకోవాలి అని విన్నది. ఆ విధంగా తీసుకున్న తరువాతే రొట్టె విరచుటయందు పాలిభాగస్తురాలు కావాలనే నిర్ణయముతో జూన్26, 2016 మరల సరియైన క్రమములో బాప్తిస్మము తీసుకొని రక్షణ పొందింది. ఇప్పుడు తన మనస్సులో ఉన్న భారము, వేదన అంతా తొలగిపోయిందని చెప్పింది.

మా కుటుంబములోని వ్యక్తులు సంఘకాపరులుగా ఉన్నప్పటికి వారికి మన పరిచర్యలో ఉన్నవారికి చాలా వ్యత్యాసం కనబడుతుంది. ఇది నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది మరియు దైవసేవకులు బోధించుచున్న వాక్యము ద్వారా నన్ను నేను ఏ విధముగా సరి చేసుకోవాలో, వ్యక్తిగతముగాను, కుటుంబముగాను ఆత్మీయముగాను ఎలా ముందుకు కొనసాగాలో, శోధనను ఎలా జయించాలో, నేర్చుకున్నాను. ఇప్పుడు నా జీవితములో ఎన్ని బాధలు, ఇబ్బందులు ఎదురైన దేవుడు నన్ను నడిపిస్తాడు అనే ధైర్యము ఉంది.

పరిచర్యలో ముందుకు వెళ్తూ ఉండగా దేవుని వాక్య ప్రకారం ఎలా ఉండాలో, తద్వారా కలిగే ఆత్మీయ ఆనందం, ఎంత మధురంగా ఉంటుందో అనుభవపూర్వకముగా అనేక విషయములలో నేను తెలుసుకున్నాను. ఈ విషయమై దేవునికి వేల కోట్ల కృతజ్ఞతలు తెలిపినను తక్కువే. ఎలాంటి అర్హతలేని నాకు ఇట్టి ధన్యత ఇచ్చిన దేవునికి మంచి మార్గములో ముందుకు సాగుటకు వాక్యమనే వెలుగును తన మాటల ద్వారా చెప్పి నా భార్యకు సహాయపడ్డ ఎపఫ్రా అన్నయ్యకు మా వందనములు.

మాకు ఇద్దరు పిల్లలు, నేను నా కుటుంబము దేవునిలో నమ్మకంగా ఇష్టులముగా, విశ్వాసముతో ముందుకి సాగునట్లుగా మా కొరకు ప్రార్థించగలరు.

# గొప్ప ప్రణాళిక

మానవుని (స్త్రీ పురుషులను) సృష్టించడంలో దేవునికి అసలైన కారణం ఒకటి ఉంది. వారి పట్ల అద్భుతమైన ప్రణాళిక, ఉద్దేశాలు ఆయనకు ఉన్నాయి. దేవుడు ప్రేమా స్వరూపి గనుక తన జీవాన్ని వారితో పంచుకోవడానికి తగిన యోగ్యతా అభిరుచి గల ప్రాణులు ఉండాలని ఆశించాడు. తాను తలపెట్టిన కార్యాల్లో తన సర్వస్వంలో పాల్గొని తన కుమారుల్లా తనతో బాటు ఈ భూమ్యాకాశాల్ని పాలించేవారు కావాలని ఆయన కోరాడు. కాబట్టి నరుణ్ణి తన పోలికలో సృష్టించాడు.

**"దేవుడు - మన స్వరూపమందు మన పోలికచొప్పున నరులను చేయుదము; వారు సముద్రపు చేపలను, ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమి మీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురు గాకనియు పలికెను. దేవుడు తన స్వరూపమందు నరుని సృష్టించెను; స్త్రీని గాను, పురుషునిగాను వారిని సృజించెను" - ఆది 1:26,27**

భూమ్యాకాశములను సృజించక పూర్వం దేవుడు చాలా అద్భుతమైన వాటిని సృజించాడు. దేవుని చిత్తాన్ని నెరవేర్చడమే లక్ష్యంగా గల ఆత్మ స్వరూపులైన దూతలు అలా సృష్టింపబడిన వారే. దూతలు దేవుని ఆరాధిస్తూ ఎడతెగక పరిచర్య చేస్తూ ఉంటారు(ప్రకటన 5:11-14) కాని ప్రముఖ దూతల్లో ఒకడైన లూసిఫర్, మానవుని సృష్టించాలన్న దేవుని పథకాన్ని గ్రహించినప్పుడు, దేవునిపై తిరుగుబాటు చేశాడు. దేవుని సింహాసనానికి పైగా తానుండగోరాడు. మానవాళికి దేవుడు ఉద్దేశించిన స్థానాన్ని, అధికారాన్ని అతడు వాంఛించాడు. అతడు పరలోకంలోని దేవుని సింహాసనానికి పైగా ఉండి సృష్టి అంతటినీ పాలించాలనుకున్నాడు. లూసిఫర్ తిరుగుబాటు చేసినప్పుడు దేవుడు పరలోకం నుండి వాణ్ణి త్రోసివేసాడు. అదే సమయంలో లూసిఫర్ తిరుగుబాటులో చేరిన మూడవ వంతు దూతలను కూడా దేవుడు వానితో బాటు క్రిందికి త్రోసివేశాడు (ప్రకటన 12:4)

**"తేజో నక్షత్రమా, వేకువచుక్కా, నీవెట్లు ఆకాశమునుండి పడితివి? జనములను పడగొట్టిన నీవు నేలమట్టము వరకు ఎట్లు నరకబడితివి? నేను ఆకాశమునకెక్కి పోయెదను దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును. ఉత్తర దిక్కుననున్న సభా పర్వతము మీద కూర్చుందును. మేఘమండలము మీదికెక్కుదును. మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీవు మనస్సులో అనుకొంటివి గదా ?" - యెషయా 14:12-14.**

భూమి మీదికి త్రోయబడిన లూసిఫర్‌ను ఇప్పుడు "సాతాను" లేదా "అపవాది" అని వ్యవహరిస్తున్నారు. సృష్టికర్త అయిన దేవుని మహిమ నుండి వేరైపోయిన అతడు ఒకప్పుడు తన సౌందర్యాన్ని, తేజస్సునూ కోల్పోయాడు (యెహె 28:11-17) అంధకార పూరిత దుష్టుడుగా మారాడు. వానితో క్రిందపడిన దూతలు కూడా తమ మహిమను కోల్పోయి

దేవుడు సృజించిన నూతన ప్రపంచంలో దురాత్మలుగా మారారు. అయితే సాతానులోని దుష్ట కోర్కె మారలేదు. గనుక వాడు దేవుని సింహాసన దురాక్రమణకు మరొక పన్నాగాన్ని పన్ని ఆయన సృష్టియైన మానవుని వెంటబడ్డాడు.

దేవుడు ఆదాము, హవ్వలకు భూమి అంతటిపై అధికారాన్ని ఇచ్చి దానిని తన స్వాధీనంలో ఉంచాలని ఆదేశించాడు. సాతాను బారినుండి వాడి దురాత్మల బారినుండి వారిని కాపాడేందుకు ఆదాము హవ్వలు నివసించిన ఆ వనంలో దేవుడు రెండు విశేషమైన చెట్లను నాటి, ఒక చెట్టుకు "జీవ వృక్షం", రెండవదానికి 'మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షం" అన్న పేర్లు పెట్టాడు (ఆది 2:9,17) జీవవృక్షం స్వయంగా దేవుని జీవానికి అధికారానికి ప్రతీక. గనుక ఆ ఫలాన్ని తినడం వల్ల ఆదాము హవ్వలు అంతకంతకూ దేవుని శక్తితో, ఆయన ప్రేమతో, మహిమతో నిండుతారు. మంచి చెడ్డల తెలివినిచ్చే వృక్షం సాతాను జీవితానికి, వాడి అధికారానికి ప్రతినిధిగా ఉంది. ఆదాము హవ్వలు దాని ఫలాన్ని తిననంత వరకు భూమిలో నిండి ఉన్న దురాత్మల సమూహపు బారి నుండి తప్పించుకొని క్షేమంగా ఉన్నారు. వారి ప్రియమైన సృష్టికర్తకు గనుక వారు లోబడితే సృష్టి అంతటిపై ఆధిపత్యం సర్వదా వారిదే అవుతుంది (హెబ్రీ 2:8) అయినా సాతాను హవ్వను మోసగించాడు. మంచి చెడ్డల తెలివినిచ్చే వృక్షం నిజంగా ఏ చెరుపూ చేయదని – దానికి ప్రతిగా ఆ ఫలాన్ని భుజిస్తే, వారు దేవుళ్ళవలె మారుతారని వాడు ఆమెతో చెప్పాడు. ఆమె దాన్ని నమ్మి, ఆ ఫలాన్ని తినేసింది. ఇది అబద్ధం అని తెలిసి కూడా ఆదాము ఆ వృక్ష ఫలాన్ని తిన్నాడు (1 తిమోతి 2:14)

ఆ ఒక్క పాప కార్యం మూలంగా మానవుడు దేవుని పోలికను, మహిమను, సృష్టిపై తన ఆధిపత్యాన్ని కోల్పోయాడు. ఆదాము హవ్వలు ఖాళీ చేసిన సింహాసనాన్ని సాతాను అధిష్టించి భూమిపై  పెత్తనాన్ని చెలాయించాడు. మరణం ప్రపంచాన్ని ఆక్రమించింది (హెబ్రీ 2:14,15) ఆదాము హవ్వల తదనంతరం అన్ని తరాలవారూ ఆ పతన నైజానికి వారసులయ్యారు. అందరూ సాతాను ప్రభుత్వాధికారం క్రిందకు వచ్చారు. ప్రతిచోటా ప్రజలందరి హృదయములు ఈ విషయములతో నిండి ఉన్నాయి.

"మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు. కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకారమాయెను; తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చిరి – రోమా 1:21-23"

"ఈ హేతువు చేత వారు తమ హృదయముల దురాశలను అనుసరించి, తమ శరీరములను పరస్పరము అవమానపరచు కొనునట్లు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించెను". "అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి, సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు, ఆమేన్!" "అందువలన దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించెను. వారి స్త్రీలు సైతము స్వాభావికమైన ధర్మము విడిచి స్వాభావిక విరుద్ధమైన ధర్మమును అనుసరించిరి. "అటువలె పురుషులు కూడ స్త్రీ యొక్క స్వాభావిక ధర్మమును విడిచి, పురుషులతో పురుషులు అవాచ్యమైనది చేయుచు, తమ తప్పిదమునకు తగిన ప్రతిఫలమును పొందుచు ఒకరి యెడల ఒకరు కామతప్తులైరి" – రోమా 1:24-27

"మరియు వారు తమ మనస్సులో దేవునికి చోటియ్యనొల్లక పోయిరి గనుక చేయరాని కార్యములు చేయుటకు దేవుడు భ్రష్ట మనస్సుకు వారినప్పగించెను. అట్టివారు సమస్తమైన దుర్నీతి చేతను, దుష్టత్వము చేతను, లోభము చేతను, ఈర్ష్య చేతను నిండుకొని, మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరమను వాటితో నిండినవారై "కొండెగాండ్రును, వాదకులును, బింకము లాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రుల కవిధేయులును, అవివేకులును, మాటతప్పు వారును అనురాగ రహితులును, నిర్దయులునైరి." "ఇట్టి కార్యములను అభ్యసించు వారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగ ఎరిగి యుండియు, వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించు వారితో సంతోషముగా సమ్మతించుచున్నారు" – రోమా 1:28-32

మానవుని పాపం వల్ల దేవుడు అతని విడిచి పెట్టాడా? లేదు! దానికి బదులుగా ఆయన మరొక గొప్ప ప్రణాళికను క్రియా రూపంలో పెట్టాడు. అది మానవాళిని సాతాను పట్టు నుండి రక్షించి, తన సింహాసనాన్ని పంచుకునే తన కుమారులనుగా చేయడమనే తన మొదటి పథకాన్ని పునరుద్ధరించడమే. యేసు – రక్షకుని రాకడకు ప్రపంచాన్ని ఆయత్త పరచడం ఆయన ఆరంభించాడు.

**"ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు"** – 1 కొరింథీ 15:22

మన పాపాల నుండి విడిపింపగల క్రీస్తు వృత్తాంతాన్ని నూతన నిబంధన నివేదిస్తున్నది.

# సులభమైన ప్రార్థనా యొక్క శక్తి

దేవుని వాక్యం నిజమైన ధననిధి. మనము ఉద్దేశపూర్వకమైన శక్తివంతమైన, విజయవంతమైన జీవితములు జీవించునట్లుగా అవసరమైన ప్రతి విధమైన జ్ఞానమును, నిర్దేశకత్వాన్ని, సత్యమును ఇది కలిగి ఉంటుంది. మనం ప్రార్థనలో వాక్యమును పలుకుతూ ఉన్నప్పుడు దేవుడు చెప్పిన మాటలనే తిరిగి చెబుతూ ఆయనతో ఏకీభవిస్తున్నామని అర్థం. ఆయనతో లోతైన గొప్ప సంబంధమును నిజముగా ఇష్టపడినట్లైతే మనం ఆయనతో ఏకీభవించవలసి ఉన్నది. ఇలా చేయుటకు వాక్యమును ఒప్పుకొనుట కంటే మంచి మార్గం లేదు. ఈ ఒప్పుదల వాక్యము మనలో జ్ఞానమును మరియు దేవునిలో విశ్వాసమును పెంచుతుంది. అది మన ప్రార్థనలలో ప్రభావమును అభివృద్ధి చేస్తుంది.

వాక్యమును ఒప్పుకొను క్రమములో మనము వాక్యమును బాగా తెలుసుకొని ఉండాలి. ఎందుకంటే ఆయన ఏమి చేశాడో, ఏమి చెప్పాడో, తెలియకుండా మనము ఆయనతో ఏకీభవించలేము. ఆయనను మనము చేయమని అడుగుతున్న దానిని ఎప్పుడో పూర్తి చేసేశాడు. దేవుడు మనకు ఇంతకు ముందే ఇచ్చిన వాటి గురించి ప్రార్థనలో మరలా మరలా అడగడం పూర్తిగా అనవసరం. దేవుని వాక్యమును బట్టి ఆయనను ప్రార్థించేటప్పుడు సరైన విధానములో అడగవలసి ఉన్నది. ఆయన ముందుగానే చాశాడని చెప్పిన వాటిని గురించి, మరలా చేయమని అడిగినట్లుగా అడగకూడదు.

**ఉదాహరణకు :-**

- దేవుని స్వరము వినాలని ప్రార్థించుటకు బదులుగా, మనము దేవుని స్వరము వినగలుగుతున్నందుకు ఆయనకు వందనములు చెల్లించాలి. **"నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును - యోహాను 10:27"**

- మాకు స్వాతంత్ర్యము ఇవ్వమని ప్రార్థించుటకు బదులుగా మనలను స్వతంత్రులుగా చేసినందుకు వందనములు చెల్లించాలి **"ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి, మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి. - గలతీ 5:1"**

- మన జీవితముల గురించి మంచి ప్రణాళికలు కలిగి ఉండమని దేవుని అడుగుటకు ప్రార్థించుటకు బదులుగా మంచి ప్రణాళికలను కలిగి ఉన్నందుకు వందనములు చెల్లించవలసి ఉన్నది. **"నేను మిమ్మునుగూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణకలుగునట్లుగా అవి సమాధానకరమైన**

**ఉద్దేశములేగాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు. - యిర్మీయా 29:11"**

- మనలను నీతిమంతులుగా చేయమని అడుగుటకు బదులుగా మనము నీతిమంతులముగా చేయబడినందుకు వందనములు చెల్లించవలసి ఉన్నది. **"ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను - 2 కొరింథీ 5:21"**

- మనలను ఆశీర్వదించమని దేవుని అడుగుటకు, ప్రార్థించుటకు బదులుగా మనలను ప్రతి ఆశీర్వాదముతో ఆశీర్వదించినందుకు దేవునికి వందనములు చెల్లించవలసి ఉన్నది. **"మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోకవిషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను. - ఎఫెసీ 1:3"**

- మనలను అంగీకరించమని ప్రార్థించుటకు బదులుగా ఆయన క్రీస్తులో మనలను అంగీకరించినందున వందనములు చెల్లించవలసి ఉన్నది. - **"ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను. - ఎఫెసీ 1:6"**

- సేకరించబడింది

(ఇంకా ఉంది)



# మూర్ఖు(రా)లు

మూర్ఖుడు అనే మాటని ఆయా సమయములలో మనుష్యుల నోట మనము వింటూ ఉంటాము. మూర్ఖులు అనబడేవారు తాము చేయు పనులను బట్టియూ, వారి మాటలను బట్టియూ తెలియపరచబడతారు. చేసే పనులు, మాట్లాడే మాటలు తప్పు అని ఎంతమంది చెప్పినప్పటికి, ప్రవర్తనని మార్చుకొనకుండా కొనసాగేవారిని మూర్ఖులు అంటారు. మూర్ఖులు జ్ఞానుల ఉపదేశమును తిరస్కరించెదరు. (సామె 1:7)

మూర్ఖత్వముతో ప్రవర్తించువారు తమ చుట్టూ ఉన్నవారికందరికి ఇబ్బందిని కలిగించేవారిగా ఉంటారు. ప్రతి మనుష్యుడు తన జీవితములో అనేక బాధ్యతలతో కూడిన పాత్రలను పోషించవలసి ఉంటుంది. ఉదాహరణకు కుమారుడు, కుమార్తె, భార్య, భర్త, తల్లి, తండ్రి, పనివాడు, యజమాని, పొరుగువాడు.

మూర్ఖత్వముతో జీవించు వాని వలన అన్ని పాత్రలకు తీరని అన్యాయం జరుగుతుంది. ఈ స్వభావము అనేక వ్యసనముల కంటే ప్రమాదకరమైనది. చూడడానికి చాలా మంచివారిగా కనబడుతూ, అందరి మధ్య తిరుగుతూ ఉన్నట్లుగా అనిపించినప్పటికి, వారి జీవితములలో ఉన్న మూఢత వలన అనేకులు నష్టపోతూ ఉంటారు. మూర్ఖుని మూఢత వాని కనులకు పొరల వంటిది. వారేమి చేస్తున్నారో, దాని వలన ఎంత నష్టం కలుగుతుందో, ఏ మాత్రమూ గ్రహించలేని వారిగా ఉంటారు. విచిత్రమైన విషయమేమిటంటే మూర్ఖులకు తమ మార్గము తమకి సరియైనదిగా కనబడును. మూఢుని మార్గము వాని దృష్టికి సరియైనది (సామె 12:15)

మూర్ఖపు ప్రవర్తన కలిగిన మనుష్యుల వలన మానవ సంబంధములు దారుణంగా దెబ్బతింటాయి. వారు ఎవ్వరినీ నెమ్మదిగా ఉండనివ్వరు. వారి విపరీత ప్రవర్తన ఇంట్లో భార్యను, పిల్లలను భయోత్పాతానికి గురి చేస్తాయి. అలాగే ఒక మూర్ఖురాలి వలన ఇంట్లో భర్త, పిల్లలు జీవచ్ఛవములుగా బ్రతుకుతూ ఉంటారు. మూఢురాలు తన చేతులతో తన యిల్లు ఊడబెరుకును (సామె 14:1)

మూఢుని రోటిలోని గోధుమలలో వేసి రోకట దంచినను వాని మూఢత వాని వదిలిపోదు (సామె 27:22) బైబిల్ గ్రంథములోని ఈ మాటకి అర్థం ఎన్ని దెబ్బలు కొట్టిననూ, ఎందరు ఎంత బుద్ధి చెప్పిననూ మూర్ఖుని మూఢత వదిలిపోదు.

మనము మూర్ఖులుగా పిలవబడకుండా జీవించాలంటే మనము చేసేదే కరెక్ట్ అని ఎప్పుడూ అనుకోకుండా ప్రతి వ్యక్తి యొక్క సలహాలను పరిగనలోనికి తీసికొని మంచి చెడ్డలను వివేచించుటకు సమయమును కేటాయించుకొని, ప్రతి విషయములోను ఆత్మ విమర్శ చేసుకుంటూ ముందుకి వెళ్ళాలి. మనలను మనం నియంత్రించుకోలేని విషయములలో దేవుని సహాయము కొరకు ప్రార్థన చేయడం ద్వారా దేవుని యొద్ద నుండి ఆశ్చర్యకరమైన సహాయమును మనం పొందగలం.

ప్రభువైన యేసుక్రీస్తు మనుష్యులను వారి మూఢత్వం నుండి విడిపించడానికి పరలోకము నుండి భూమి మీదకు వచ్చి మనలో ఒకని వంటి వాడిగా జీవించి, మానవులను వారి మూర్ఖత నుండి విడిపించడం జరుగుతుంది.

ఇది చదువుతున్న వారి జీవితములను మూర్ఖత్వం నుండి విడిపించును గాక !

**- ఎడిటర్**

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.00 గం॥ల నుండి సాయంత్రం 6.00 గం॥ల
వరకు సంప్రదించగలరు.

---

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com




# బైబిల్ క్విజ్ - 47

(దినవృత్తాంతములు)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** యెహోవా వలన ఏ పారసీక దేశపురాజు మనస్సు ప్రేరేపించబడింది?

**2.** దావీదు కాలంలో గాయక బృందానికి అధిపతి ఎవరు?

**3.** ఆపత్కాలమందు కూడా మరింత అతిక్రమం చేసిందెవరు?

**4.** కర్ణ పిశాచాల వద్ద విచారణ చేసినందుకు ఏ రాజు చనిపోయాడు?

**5.** ఆదాము పేరుతో మొదలయ్యే బైబిలు పుస్తకం ఏది?

**6.** దుర్మార్గంగా ప్రవర్తించమని తన కుమారుణ్ణి ప్రోత్సాహపరచిన తల్లి ఎవరు?

**7.** తన సహోదరుల కంటే ఘనత పొందినవాడని ఎవరి గురించి చెప్పబడింది?

**8.** యెహోవా వద్ద విచారణ చేయకుండా తన రోగ విషయంలో వైద్యుల సహాయాన్ని వెదికిన రాజు ఎవరు?

**9.** భూమి మీద ఉన్న పరాక్రమ శాలులలో మొదటివాడు ఎవరు?

**10.** యెహోవా కుదరచాలని వ్యాధిచేత అతనిని ఉదరమున మొత్తినందున పేగులు పడిపోయి మరణించిందెవరు?

**ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఆగష్టు 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు సెప్టెంబరు 2016 పత్రికలో ప్రచురించబడతాయి.**

**పంపవలసిన చిరునామా - ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070**

**బైబిల్ క్విజ్ - 46 జవాబులు (2 రాజులు నుండి ఇవ్వబడినవి)**

| | |
|---|---|
| 1. మనహేము 15:16 | 2. యెహోయాషు 13:14 |
| 3. అతల్యా 11:13,14 | 4. హిజ్కియా 20:20 |
| 5. హిజ్కియా 19:3 | 6. యోవాషు 11:21 |
| 7. హిజ్కియా 18:1-4 | 8. అజర్యా 15:1-5 |
| 9. ఆహాజు 20:11 | 10. ఎలీషా 6:6,7 |

**బైబిల్ క్విజ్ - 46 ప్రశ్నలకు సరియైన జవాబులు రాసి పంపిన వారి పేర్లు:**

పాపరమేష్, లక్ష్మి, కొర్నేలీ, రాజు ఫ్లోరెన్స్, ఐజాక్ కుమారి, సుశీల, షాలేము, చంటి, చైత్రికబిస్వాల్, స్వాతిరాజీవ్, షీబా, సువర్ణ, శ్రీకాంత్, ప్రసన్న, సౌజన్య.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జూలై - ఆగష్టు

**భాగ్యలత:** సాంబశివరావు, రజని, సంధ్యారాణి, శారమ్మ, మాధవిలత, శ్రీలక్ష్మి, అక్షయ, ఎస్తేరు, రమేష్, యేసయ్య, గోపిచంద్, సరస్వతి, వినీత, ఇంద్రమ్మ, గంగాధర్, సాత్విక్, పద్మిని, హరిబాబు, సుకుమార్, రూఫస్, అతిశయ్, గురుస్వామి, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, ప్రశాంతవర్మ, రామకృష్ణ, పాపమ్మ, రాజేష్, వినయ్, శ్వేత, నవీన్, షర్మిల, శ్రావణి, హైమావతి, బ్యూలా, అనంతలక్ష్మి, మణెమ్మ, విశ్వాస్, సుగంధ్, కిషోర్‌కుమార్, ప్రణీత, నయోమిశామ్యూల్, పవన్‌కుమార్, స్పర్జన్, దుర్గ, సుశీల్‌చంద్ర, రత్నం, ప్రమోద్, ఆనంద్, నరసింహ, విజయరాజు, ప్రభాకర్, దివ్య, కనకరాజు, ప్రతిభ, శాంతమ్మ, ప్రసాద్, అనూరాధ, అవని, స్ప్లెండిడ్ నెహెమ్యా, మాధవి, రాజేశ్వర్రావు, విమలాగ్రేస్, హరీష్, గణేష్, జ్యోతి, పర్ణిక, రమేష్‌కుమార్, సుబ్బారావు, పాల్ వినయ్, ప్రకాష్, కీర్తి, షారోన్‌బాబు, యెషయా, రమ్యవర్మ, భానుప్రకాష్, సుజన, దినకరన్, నాంచారమ్మ, విజయలక్ష్మి, దివ్యవాణి, పాపారాణి, మణికంత, తరుణి, కావ్య, రూతుప్రమీలారాణి, జోసెఫ్, సైదులు, సుభాష్, సుశాంత్, శిరీష, ఉన్నత్, శ్రీకాంత్, ఆశ్రయ్, రత్నకుమారి, సురేష్, రమాదేవి, అరుణ, లావణ్య, రాజశేఖర్, ప్రసన్నకుమారి, సంతోష్, హెూమి, నిఖిల్, రమ్య (మిర్యాలగూడ), షీబారాణి..

**చింతల్:** జీవన్, గణేష్, అఖిల, సుధాకర్, కోమలి, రవిబాబు, వెంకటేశ్వర్రావు, సౌజన్య, శ్రీనివాసరావు, ప్రశాంతి, జస్వంతరావు, నాగాంజనేయులు, షైనీ, విజయ, శిల్ప, సోనీ, సుమంత్, కార్తీక్, తేజస్విని, పరిశుద్ధరావు, రాము, ప్రవీణ్, సత్యం, దీపిక, కాలేబు, వీణ, నాగరాజు, శ్యామ్‌కుమార్, ప్రభాకర్, వెంకటలక్ష్మి, అజయ్‌కుమార్, శివ, దివ్య, భగవత్‌వర్మ, చిట్టెమ్మ, ఆనంద్, శ్రీనివాస్, అరుణ, వెంకటరమణ, నిరీక్షణ, దీవెన.

**అనాజ్‌పూర్:** థామస్‌పీటర్, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్, సంజివ్, షాలేమురాజు, జాన్సన్, సిద్ధు, మణి, సౌజన్య, జ్యోతి, విజయలక్ష్మి, అన్వేష్, దివ్య, అభిలాష్, ప్రమీల, భువనేశ్వరి, దయామణి,

**ఇ.సి.ఐ.యల్:** వెంకటేశ్వర్రావు, విజయ్‌కుమార్.

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________

2. చిరునామా: ______________________

______________________

______________________

పిన్ కోడ్: ______________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________

______________________

______________________

______________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# కైలాస మహర్షి

కైలాస మహర్షి ఒక క్రైస్తవ ఋషి. ప్రస్తుతము కైలాస పర్వత గుహలో నివసిస్తున్న ఆయన వయస్సు 510 సం॥లు మించి ఉంటుంది. ఈజిప్ట్ దేశస్థుడైన మహమ్మదీయుడీయన. క్రీస్తుని అంగీకరించిన తరువాత విశేషమైన కృపావరము పొంది ప్రపంచమందలి ప్రజలందరి కొరకు, విశేషముగా విశ్వాసుల కొరకు విజ్ఞాపన చేస్తూ ఆత్మసంచారము చేస్తున్న భక్తాగ్రేసరుడు. 1912లో సాధుసుందర్ సింగ్ అనుకొనని విధంగా, ఆయనను చూచి, సంభాషించి ఆయన జీవితానుభవములను తెలుసుకున్నారు.

1912 వేసవిలో సాధుసుందర్‌సింగ్ కైలాస పర్వత ప్రాంతములో (పశ్చిమ టిబెట్) సువార్తను ప్రకటింప వెళ్ళారు. అచ్చట హిందూ ఋషులెవరైనా కనపడతారేమోనన్న జిజ్ఞాసతో పరిశీలిస్తూ ఒక బండపై నడుస్తూ కాలుజారి కొన్ని అడుగుల దిగువనున్న మైదానములో పడ్డాడు. కొంతసేపు స్పృహ కోల్పోయి, తరువాత కండ్లు తెరచి చూడగా తానొక గుహ ముఖమున నున్నట్లు గ్రహించాడు. ఆగుహలో ఒక వింతాకారమును కనుగొని భయకంపితుడైనాడు. మరికొంత దగ్గరకు వెళ్ళి చూడగా ఒక వృద్ధుడు గాఢధ్యానములో నున్నట్లు గ్రహించాడు. ఆయన వెంట్రుకలు మిక్కిలి పొడవుగా వ్రేలాడుతూ, శరీరమంతటినీ కప్పివేశాయి. ఆయన గడ్డము భూమిని తాకింది. కనుబొమ్మలు తెరలు వలె కండ్లను కమ్మి వేశాయి.

సుందర్‌సింగ్ ఆ వింత వ్యక్తిని పలకరించడానికి ప్రయత్నించాడు. కొంతసేపటికా వృద్ధుడు కన్నులు తెరిచాడు. ఆయన కన్నులు మిక్కిలి తేజోవంతములై అంతరంగమును సయితం పరిశోధిస్తున్నట్లు సుందర్ గ్రహించాడు. “మనము మోకాళ్ళూని ప్రార్థింత” మని ఆ మహర్షి హిందూస్థానీలో పలికినపుడు సుందర్‌సింగ్ తలవంచాడు. ఆ మహర్షి గంభీరమైన ప్రార్థనను యేసు నామమున చేసి, తన చేతిలో నున్న చర్మపుచుట్టను విప్పి మత్తయి 5వ అధ్యాయములో కొన్ని వాక్యాలను చదివాడు. సుందర్‌సింగ్‌కు ఆ ఋషితో సంభాషించవలెనన్న కుతూహలము కలిగింది. మీరెవరు? ఎందునిమిత్తము యిచ్చటికి వచ్చారు? అని సవినయంగా ప్రశ్నించగా, మహర్షి తన సానుభవాన్ని సుందర్‌సింగ్‌కు వివరించాడు.

(ఇంకా ఉంది)

# హెన్రీ మార్టిన్

లోకములో మూడు రకములైన గొప్ప వ్యక్తులున్నారని ఒక భక్తుడు చెప్పాడు. మొదటివారు లోకమును వారి గొప్ప కార్యములతో నింపుతారు. మనుష్యుల చేత కొనియాడబడతారు. రెండవ రకము వారు తెలివైన వారుగా ఉండి ఉన్నత పదవులను సంపాదించుకుంటారు, ప్రసిద్ధి కెక్కుతారు. మూడవ రకము వారు త్యాగము చేయుటలోను, జాలి, ప్రేమ కలిగియుండడంలోను చాలా శ్రేష్ఠులైయుంటారు. దేవుడు వీరి విషయమై తృప్తి చెందుతాడు. ఈ కోవకు చెందిన వాడే “హెన్రీ మార్టిన్”

క్రీ.శ 1781 ఫిబ్రవరి 18వ తేదీన కార్న్‌వాల్ లోని ట్రురో అను గ్రామములో గనిలో పని చేయుచుండిన ఇంగ్లాండు దేశస్థుడైన జాన్ మార్టిన్‌కు మూడవ సంతానముగా హెన్రీ మార్టిన్ జన్మించెను. హెన్రీ 2 సం॥ల వయస్సులోనే తల్లిని పోగొట్టుకొన్నాడు.

మార్టిన్ యౌవనకాలములో ఒక భయంకరమైన పోరాటము ఉండినది. తన మార్పు విషయము లోకము మీద అతనికి ఉన్న ఆకర్షణ విషయము అంతరంగములో పోరాటము జరిగింది. కానీ లోకం మీద ఆకర్షణయే అతనిని జయించినది. కొన్ని నెలలకు మార్టిన్ తండ్రి చనిపోయెను. తండ్రి మీద ఉన్న ప్రేమను బట్టి ఆ దుఃఖములో అతడు పరిశుద్ధ గ్రంథమును చదువనారంభించెను. డేవిడ్ బ్రైనార్డ్, మరియు విలియం కేరీ యొక్క జీవిత చరిత్రలు హెన్రీలో ఉజ్జీవమును కలిగించాయి.


**ఎపఫ్రా మినిస్ట్రీస్**

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras